ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

ఆదివారం 3 మార్చి 2024

డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్



అందరూ ఇన్‌చార్జ్‌లే..

ఆరు జిల్లాలకు లేని పూర్తిస్థాయి డీఈవోలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యాశాఖ పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉంది. అస్తవ్యస్థ పరిస్థితి నెలకొన్నది. విద్యార్థులను విద్యావంతులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత కలిగిన విద్యాశాఖకే దిక్కులేని పరిస్థితి. చాలా ఏళ్లుగా రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జిలతోనే కూనారిల్లుతున్న ఈ శాఖలో పరిపాలన కొరవడి, పర్యవేక్షణ కుంటుపడి పూర్తిగా గాడి తప్పింది. ఏం జరుగుతున్నదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఏ ప్రభుత్వ శాఖలోనైనా కీలక పదవుల్లో ఒకరిద్దరు ఇన్‌చార్జిలు ఉంటారు. అదేమిటోగానీ.. విద్యాశాఖలో మాత్రం అంతాఇన్‌చార్జిలే రాజ్యమేలుతున్నారు. పైగా ఒక్కొక్కరికి రెండు మూడు బాధ్యతలు ఉన్నాయి. వీరంతా అసలు ఉద్యోగం వదిలేసి కొసరు కొలువుల్లో కొనసాగుతున్నారు. ఫలితంగా విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అంతకంతకూ పడిపోతోంది. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చదువులు సట్టుబండలయ్యాయి. బళ్లు కడకండ్ల పాలయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యా శాఖ దుస్థితిపై ప్రత్యేక కథనం..

- డిప్యూటీ డీఈవోలు అసలే లేరు
- రెగ్యులర్ ఎంఈవో ఒక్కరే..
- అన్ని మండలాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కు
- 70 శాతం స్కూళ్ల హెచ్‌ఎంలూ వారే
- ఉమ్మడి జిల్లాలో 2,500 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- కుంటుపడుతున్న చదువులు.. గాడితప్పిన విద్యాశాఖ

హనుమకొండ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ ఇన్‌చార్జ్‌ల పాలనలోనే కొనసాగుతోంది. డీఈవోలు, ఎంఈవోలు, ఆఖరికి హెచ్‌ఎంలు కూడా ఇన్‌చార్జ్‌లే ఉన్నారు. డిప్యూటీ డీఈవోలు అసలే లేరు. డైట్ కాలేజీకి కూడా పూర్తికాలపు ప్రిన్సిపాల్ లేడు. బీఈడీ కాలేజీకి ప్రిన్సిపాల్ ఉన్నా ఆయనకు అదనపు బాధ్యతను అంటగట్టారు. దీనితో ఉన్నవారిపై అదనపు పనిభారం పడి పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీనితో ప్రభుత్వపాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చదువులు చెప్పే గురువులు లేక విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోగా సర్కార్ బళ్లు క్రమంగా మూతపడుతున్నాయి.

ఉపాధ్యాయుల కొరత

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2500 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 5.50లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 90 శాతం పాఠశాలలకు రెగ్యులర్ హెడ్ మాస్టర్లు లేరు. పాఠశాలల్లో పని చేసే సీనియర్ అధ్యాపకులకే హెడ్‌మాస్టర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. దీనితో వారు ఎప్పు డు వస్తారో ? ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి. మరో వైపు ఉమ్మడి జిల్లాలోని సర్కార్ బళ్లను ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 2500లకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయుల నియామకానికి పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం డీఎస్‌సీని నిర్వహించ లేదు. ఇటీవల డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసినా అందులో ఉమ్మడి జిల్లాలో చూపిన టీచర్ పోస్టులు 560 మాత్రమే. టీఎస్‌పీఎస్‌సీ పరీక్షా పత్రాల లీకేజీతో ఈ నియామక ప్రక్రియ కూడా అటకెక్కింది. గత అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్న తులు లేవు. ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం తగ్గుతుండడానికి, సర్కార్ బళ్ల మూతబడానికి ఇది కారణమౌతోంది.

డిప్యూటీ డీవోలు లేరు..

డీఈవోలుసరే ఎలాగూ లేరు. కనీసం డిప్యూటీ డీఈవోలు అయిన ఉన్నారా.. అంటే ఒక్కరు కూడా లేరు. ఉన్న ఒక్క డిప్యూటీ డీఈవో వాసంతికి డీఈవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఉమ్మడి జిల్లాలో ఒక్కరు కూడా లేకుండాపోయారు. ఇదివరకు వరంగల్, జనగామ, మహబూబాబాద్ డివిజన్లకు ఒక్కొక్కరు చొప్పున డిప్యూటీ డీఈవోలు ఉండేవారు. వారంతా రిటైర్ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారేవరూ రాలేదు. ఆ పోస్టులన్నీ అలాగే ఖాళీగా ఉండిపోయాయి.

ఒకే ఒక్క ఎంఈవో

ఉమ్మడి జిల్లా పరిధిలో 75 మండలాలుండగా మండలానికో విద్యాశాఖాధికారి (ఎంఈవో) విధిగా ఉండాలి. కానీ ప్రస్తుతం ఒకే ఒక్క ఎంఈవో

మిగతా 7వ పేజీలో..

ఇన్‌చార్జ్ డీఈవోలు

- హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు రెగ్యులర్ జిల్లా విద్యాశాఖాధికారులు (డీఈవో)లు చాలా కాలం నుంచి లేరు.
- హనుమకొండ జిల్లాకు ప్రస్తుతం డీఈవో ఉన్న అబ్దుల్‌హై ఇన్‌చార్జే. వాస్తవంగా ఆయన బీఈడీ కాలేజీలో లెక్చరర్. ఆ కాలేజీకి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. దీనితో పాటు ఆయనకు డీఈవో బాధ్యతలను కూడా అప్పగించారు.
- వరంగల్ జిల్లాకు కూడా రెగ్యులర్ డీఈవో లేదు. ఇన్‌చార్జ్ డీఈవోతోనే నాలుగేళ్లుగా నెట్టుకువస్తున్నారు. ఆరు జిల్లాల్లో ఒకే ఒక్క డిప్యూటీ డీఈవోగా ఉన్న వాసంతిని వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ డీఈవోగా కొనసాగుతున్నారు.
- జనగామ డీఈవో రాము ఇన్‌చార్జే. ఆయన రెగ్యులర్ పోస్టు విద్యాశాఖ (హైదరాబాద్)లో అడిషనల్ డైరెక్టర్. రెండేళ్ల కిందట జనగామ డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు అంటగట్టారు. దీంతో ఆయన జోడుగుర్రాల స్వారీ చేస్తున్నారు. ఇక్కడ ఒక రోజు, అక్కడ ఒక రోజు విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌కే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అదనపు డైరెక్టర్ అయిన రామారావుకు ఇక్కడ ఇన్‌చార్జ్ డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏడాదిగా ఆయన అక్కడా.. ఇక్కడా రెండు పడవలపై కాళ్లుపెట్టి ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు.
- ములుగు జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే దిక్కయ్యారు. మంచిర్యాల జిల్లాలో ఏడీగా పనిచేస్తున్న పాణికి ఇక్కడ విద్యాశాఖ బాధ్యతలు అప్పగించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు కూడా ఇన్‌చార్జ్ డీఈవోనే కొనసాగుతున్నారు. అడిషనల్ డైరెక్టర్ అయిన రాంకుమార్ ఈ అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

రామప్పలో దక్షిణాఫ్రికా దేశస్థుల సందడి



రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న విదేశీయులు

వెంకటాపూర్(రామప్ప), మార్చి 2: మండలంలోని రామప్ప దేవాలయాన్ని దక్షిణాఫ్రికా దేశస్థులు శనివారం సందర్శించారు. వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు, జర్నలిస్టులు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్లు హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్నారు. శిక్షణలో భాగంగా వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ సూర్యకిరణ్, ములుగు సీఐ రంజిత్‌కుమార్, స్థానిక ఎస్సై చల్ల రాజు, తహసీల్దార్ సదానందం, డీటీ కిషోర్, ఎంసీహెచ్‌ఆర్‌డీ అధికారులు ఉన్నారు.

పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

భూపాలపల్లి జిల్లాలో 34,728 మంది చిన్నారులు



భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 2: పల్స్‌పోలియో కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో 14 పీహెచ్‌సీ పరిధిలో 296 పోలియో కేంద్రాలను వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం చేసింది. ఆదివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టనుండగా ఐదేళ్లలోపు 34,728 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకు 2,142 వాయిల్స్‌లను వైద్యశాఖ అందుబాటులో ఉంచింది. బస్టాండ్లతోపాటు ప్రధానంగా జనసంచారం అధికంగా ఉండే 14 ప్రాంతాల్లో పల్స్‌పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటితోపాటు 14 మొబైల్ టీంలను అందుబాటులో ఉంచారు. భూపాలపల్లి పీహెచ్‌సీలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం లాంచనంగా ప్రారంభించనున్నారు.

4,5 తేదీల్లో ఇంటింటికి..

ఎంపిక చేసిన పోలియో కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఐదేళ్లలోపు చిన్నారులకు వైద్యసిబ్బంది ఆదివారం పోలియో చుక్కలు వేయనున్నారు. డ్రాప్స్ వేసుకోని చిన్నారులకు కోసం వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది ఈనెల 4,5 తేదీల్లో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారు. వీరితోపాటు జిల్లాకు వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి ఇటుక బట్టీలు, ఇతర పనులు చేసుకునే కార్మికులకు సంబంధించిన 303 మంది చిన్నారులకు కూడా డ్రాప్స్ వేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

సీఎంఆర్ చెల్లించని మిల్లర్లపై చర్యలు!

కాటారం మండలంలోని బీఆర్ఎస్ నేత మిల్లులో తనిఖీ

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 2: ప్రభుత్వ నిబంధనలు భేఖాతారు చేస్తూ సీఎంఆర్ చెల్లించని మిల్లర్లపై చర్యలకు సివిల్ సప్లయ్ సిద్ధమైంది. శనివారం రంగంలో దిగిన ఆ శాఖ అధికారులు కాటారం మండలం దామరకుంటలో బీఆర్ఎస్ నేత నిర్వహించే మిల్లులో తనిఖీ చేపట్టారు. మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని మరో మిల్లులో త్వరలోనే తనిఖీ చేయనున్నట్టు తెలిపారు. ఖరీఫ్ సీజన్ (2022-23)కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) చెల్లించని మిల్లర్లపై సివిల్ సప్లయ్ అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. సీఎంఆర్ చెల్లించలేని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జిల్లాలోని రెండు రైస్‌మిల్లర్లలో తనిఖీలు చేపడుతున్నారు. కాటారం మండలం దామరకుంటలో బీఆర్ఎస్ నేత నిర్వహించే మిల్లు ప్రభుత్వానికి 11 ఎసికేల సీఎంఆర్ చెల్లించాల్సి ఉంది. గడువు ముగిసినా ఇంకా చెల్లించకపోవడంతో సివిల్ సప్లయ్ అధికారులు శనివారం ఆ మిల్లును సందర్శించి ధాన్యం ఏ మేరకు నిల్వ ఉంది.. మిల్లింగ్ చేస్తున్నారా.. లేదా? తదితర అంశాలను పరిశీలించారు. అయితే.. మిల్లులో ధాన్యం లేనట్టు అధికారులు గుర్తించారని సమాచారం. దీంతోపాటు మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని మరో మిల్లర్ ప్రభుత్వానికి 13 ఎసీకేల సీఎంఆర్ చెల్లించకపోవడంపై ఆ మిల్లులో కూడా అధికారులు త్వరలోనే తనిఖీ చేపట్టనున్నారు.

శ్రీపాదరావుకు ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా జయంతి వేడుకలు

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 2: దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగాయి. అధికారికంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో శ్రీపాదరావు చిత్రపటానికి కలెక్టర్ భవేష్ మిశ్రా పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచిగా రాజకీయ జీవితాన్ని ప్రాంభించిన శ్రీపాదరావు అంచెలంచెలుగా ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్పీకర్‌గా పనిచేసి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. విలువలతో జీవి తం గడిపిన శ్రీపాదరావును యువత ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కలెక్టరేట్ ఏవో మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ములుగు కలెక్టరేట్‌లో శ్రీపాదరావుకు నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, సిబ్బంది



భూపాలపల్లి కలెక్టరేట్‌లో శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

ప్రజల గుండెల్లో నిలిచిన నేత : మహేందర్‌జీ

ములుగు కలెక్టరేట్ : దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామ సర్పంచ్ నుంచి అంచెలంచెలుగా ఎదిగి ప్రజల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్‌జీ అన్నారు. కలెక్టరేట్‌లో శ్రీపాదరావు జయంతి వేడుకలు జరగ్గా ఆయన చిత్రపటానికి మహేందర్‌జీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్రీపాదరావు పలుమార్లు ఎమ్మెల్యేగా పనిచేసి మంథని నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని, స్పీకర్‌గా అత్యుత్తమంగా విధులు నిర్వర్తించి ఆ పదవికే వన్నె తెచ్చారని కొనియాడారు.

ఈకార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ప్రసాద్, సూపరింటెండెంట్ రాజ్‌ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ములుగు జిల్లా జడ్జి లలిత శివజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి లలిత శివజ్యోతి

ములుగు కలెక్టరేట్, మార్చి 2: ములుగులోని జిల్లాకోర్టులో ఈనెల 16న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి పి.వి.పి.లలిత శివజ్యోతి అన్నారు. ములుగులోని కోర్టు ఆవరణలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, భూతగాదాలు, మోటార్ వెహికిల్, రోడ్డు ప్రమాదాలు, వివాహం, కుటుంబ కలహాలు, బ్యాంకులు, చెక్‌బౌన్స్, విద్యుత్, చిట్‌ఫండ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, విద్యుత్‌చోరీ, కన్సూమర్ ఫోరం, ట్రాఫిక్ ఈ-చలాన్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని అన్నారు. రాజీపడే తగిన కక్షిదారులు న్యాయవాదులతో కోర్టుకు హాజరుకావాలన్నారు. అనంతరం పోలీస్ అధికారులతో జడ్జి సమావేశమయ్యారు. కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాజీమార్గం ద్వారా వారు తమ కేసును పరిష్కరించుకునేలా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి టి.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్, డీసీఆర్‌బీ డిప్యూటీ సూపరింటెండెంట్ సుభాష్‌బాబు, సీఐ రంజిత్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

కమలంలో వీడని ఉత్కంఠ

- తొలిజా బితాలో ఓరుగల్లుకు దక్కని చోటు
- పార్లమెంట్ ఆశావహుల్లో టెన్షన్
- పార్టీలో చేరే వారి కోసమే వేచిచూస్తోందని ప్రచారం



వరంగల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ త్వరలోనే వస్తుందన్న వార్తల నేపథ్యంలో బీజేపీ శనివారం తన అభ్యర్థుల తొలిజాబితాను విడుదల చేసింది. అందులో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరార చేయకపోవడంతో కమలం టికెట్ ఆశిస్తున్న నేతల్లో ఉత్కంఠ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా 195 మంది మందితో జాబితాను ప్రకటించగా.. అందులో రాష్ట్రంలో 9స్థానాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. అయితే ఉమ్మడి వరంగల్‌లోని రెండు స్థానాలను పెండింగ్‌లో పెట్టడంతో టికెట్ ఎవరికి అనే చర్చ జరుగుతుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి వచ్చే నేతల కోసమే పెండింగ్‌లో పెట్టారా? లేదంటే రాజకీయ, కుల సమీకరణల కోసం జాబితాలో చోటు దక్కలేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

తొలి విడతలో నిరాశే..

తొలిజాబితాలో రాష్ట్రంలోని ముగ్గురు సిట్టింగ్ ఎంపీలతో పాటు మరో ఆరుగురికి కొత్తగా అవకాశం కల్పించిన అధిష్ఠానం వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. ఇప్పటికే వరంగల్ ఎంపీ స్థానం నుంచి డజను మందికి పైగా నేతలు టికెట్ రేసులో ఉన్నారు. అయితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగను వరంగల్ నుంచి పోటీ చేయించాలని సూచించినట్టు ప్రచారం జరిగింది. అయితే ఎన్నికల్లో పోటీకి మంద కృష్ణ సుముఖంగా లేరని, మాజీ పోలీసు అధికారి కృష్ణప్రసాద్ పోటీ చేయబోతున్నారని ప్రచారం జరిగింది. వీరితో పాటు కీలకమైన నేతలు పలువురు టికెట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. తొలి విడతలోనే వరంగల్ పార్లమెంట్‌పై అధిష్ఠానం తేలుస్తుందని భావించినా కాషాయ నేతలకు నిరాశే మిగిల్చింది. అలాగే మానుకోట అభ్యర్థిని కూడా బీజేపీ పెండింగ్‌లో పెట్టింది. బీజేపీ రాష్ట్ర నాయకులు

మిగతా 8వ పేజీలో...

యూబీఐ రిటేల్ - ఎక్స్‌పో ప్రారంభం

వడ్డెపల్లి, మార్చి 2: హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి (కుడా) గ్రౌండ్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిటేల్ - ఎక్స్‌పోను యూబీఐ రీజినల్ హెడ్ పాలగుల సత్యం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో అతి తక్కువ వడ్డీతో గృహ, వాహన, విద్యా రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 14పైగా కార్లకు సంబంధించిన కంపెనీలు, 30కి పైగా బిల్డర్లు, సోలార్‌కు సంబంధించిన సప్లయర్లు పాల్గొన్నారు. రుణాలు పొందిన వారికి పాలగుల సత్యం మంజూరు పత్రాలను అందజేశారు. యూబీఐ అధికారులు నాంపెల్లి శ్రీనివాస్, రంగయ్యనాయుడు, సర్వేష్‌నాగార్జు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాలగుల సత్యం

గ్రూప్-1 ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, మార్చి 2: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రూప్- 1 పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపివి.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీలోగా తమ దరఖాస్తులను హనుమకొండ లష్కర్ బజార్‌లోని స్టడీ సర్కిల్ నేరుగా అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధి కార్యాలయంలో 6న జాబ్ మేళా

హనుమకొండ రూరల్, మార్చి 2: ఈ నెల 6వ తేదీన హనుమకొండ ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ పే, వరంగల్ హనుమకొండ కంపెనీలో 40 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 25 యేళ్ల వయస్సుగల నిరుద్యోగ యువకులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11గంటల వరకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98488 95937 సంప్రదించాలని తెలిపారు.



జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడా పోటీల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ రామన్

సందడిగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

10 రాష్ట్రాల నుంచి 200 క్రీడాకారులు హాజరు

ఈనెల 8 వరకు పండుగ వాతావరణంలో క్రీడలు

హనుమకొండ స్పోర్ట్స్, మార్చి 2: ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ఆదేశాల మేరకు వరంగల్ ఉమ్మడి జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఓపెన్ టూ ఆల్ మెన్ టెన్నిస్ టోర్నమెంట్ సందడిగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ సుబేదారిలో వరంగల్ అఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు శనివారం తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్ రామన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు స్నేహపూర్వక సంబంధాలు పెంపొందిస్తాయన్నారు. హనుమకొండ వేదికగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందనీయన్నారు.

వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ కోశాధికారి, క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి ఎం.రవింద్రనాథ్ మాట్లాడుతూ.. ఓపెన్ టూ ఆల్ మెన్ విభాగంలో నిర్వహించనున్న టెన్నిస్ పోటీల్లో 10 రాష్ట్రాల నుంచి 70 సింగిల్స్ జట్లు, 33 డబుల్స్ విభాగాల్లో క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో ఈనెల 8 వరకు నాకౌట్ పద్ధతిన పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో గెలిచిన క్రీడాకారులకు రూ.లక్ష పారితోషికాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, కార్యదర్శి ఏవీ ఎలమురుగు, వైస్ ప్రసిడెంట్ సత్యనారాయణరెడ్డి, వరంగల్ అఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రవిందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కన్నారెడ్డితో పాటు కోచ్‌లు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇంతింతై.. కళలకు సొంతమై!

● స్వర్ణోత్సవ సంబరాలకు భారతీయ నాటక కళా సమితి సిద్ధం ● నేటినుంచి 8 తేదీ వరకు ఉభయ రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

వర్ధన్నపేట, మార్చి 2: భారతీయ నాటక కళా సమితిలో స్వర్ణోత్సవ సందడి నెలకొంది. శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు జరిగే కార్యక్రమాలు ప్రజలకు ఎంతో అలరించనున్నాయి. నాటి కళలకు వేదికగా వర్ధన్నపేట భారతీయ నాటక కళాసమితి నిలువగా, అర్ధ శతాబ్దంలోకి అడుగు పెట్టడం కళాసమితి సభ్యులకు ఆనందాన్ని తెస్తోంది. నిర్వాహకుల అంకిత భావం, కళల పట్ల వారికి ఉన్న ఆరాధనతో భారతీయ నాటక కళా సమితి కళాభిమానుల మనసులను దోచుకుంటోంది. ఒకే మాట, ఒకే బాటగా భారతీయ నాటక కళా సమితి 49 వసంతాలు పూర్తి చేసుకోనుంది. రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొంది నాటక రంగానికి చేస్తున్న సేవలతో అందరి అభిమానాలు చూరగొంటోంది. 1974లో వర్ధన్నపేట మండలం ఇల్లందలో దివంగత ఈగ శ్రీహరి, వడ్లకొండ వెంకటయ్య, వేముల ఆంజనేయులు, మల్లూరి రంగయ్య, పోశాల సూర్యనారాయణ, దివంగత సిరిపోలు వెంకట్రామరావు, వనం లక్ష్మీకాంతరావు, వడ్లకొండ ఎల్లగౌడ్ తదితరులు భారతీయ నాటక కళాసమితికి బీజం వేశారు.

అల్లూరి స్ఫూర్తితో..

1980లో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద నుంచి ఆనాటి తాలుకా కేంద్రమైన వర్ధన్నపేటకు మారింది. ప్రారంభంలో అనేక ఒడిదుడుకులకు లోనైనా కమిటీ సభ్యులు లక్ష్యసాధనే ధ్యేయంగా భావించి అప్పట్లో నిర్దిష్టమైన స్థలం, ప్రత్యేక వేదికంటూ లేకపోవడంతో నాటిక పోటీలకు తీవ్ర అవరోధాలు ఏర్పడేవి. ఈ ఇబ్బందులను శాశ్వతంగా అధిగమించాలనే దృఢ సంకల్పం వారిలో పెరిగింది. వడ్లకొండ ఎల్లగౌడ్ దర్శకత్వంలో స్థానిక కళాకారులతో అల్లూరి సీతారామ రాజు నాటికను ప్రదర్శించి దాతల ద్వారా విరాళాలు సేకరించారు. అలా అల్లూరి సీతారామరాజు నాటక ప్రదర్శనతో సేకరించిన డబ్బుతో స్థల సేకరణ చేయాలనే ఆలోచన కలిగింది.

ఐదు రోజుల పాటు..

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే నాటక పోటీలు పట్టణంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు నాటక పోటీల షెడ్యూల్‌ను ప్రకటించగా, ఐదు రోజులు పూర్తి నాటికలు వేసి, శివరాత్రిన ఇతర కార్యక్రమాలు, బహుమతుల ప్రదానం చేస్తారు. 3న మొదటి ప్రదర్శన తెలుగు కళాసమితి, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత, కళానికేతన్, వీరన్నపాలెం వారి ఆధ్వర్యంలో రాజుగారి గోచి, 4న కళాంజలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రైలే రాజు, చైతన్య కళాభారతి కరీంనగర్ వారి ఆధ్వర్యంలో స్వప్నం రాల్చిన అమృతం, 5న సిరిసిరిమువ్వ కల్చరల్ అసోయేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో హక్కు, మురళీ కళానిలయం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో అవ్వా అప్పచ్చి, 6న గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మూల్యం, మైత్రి కళానిలయం విజయవాడ వారి ఆధ్వర్యంలో బంధం, 7న అభినయ ఆర్ట్స్ గుంటూరి వారి ఆధ్వర్యంలో ఇంద్రప్రస్థం, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి ఆధ్వర్యంలో కౌసల్యా సుప్రజా రామా, 8న శివ రాత్రి పండుగ సందర్భంగా పలు కల్చరర్ ప్రోగ్రామ్స్, విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు.

కలగానే జాతీయస్థాయి పోటీలు

గతంలో నాటిక కళా సమితి కమిటీ సభ్యులు ఎంతో కృషిచేసి నాటకాలను రాష్ట్రస్థాయికి చేరేలా కృషిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కళాకారులతో పాటు తమిళనాడు, చెన్నై రాష్ట్రాలకు చెందిన కళాకారులను తీసుకువచ్చి నాటికలు ప్రదర్శింప చేశారు. సినీ రంగంలో మంచి స్థానాల్లో ఉన్న క్యారెక్టర్ ఆర్టిస్టులను సైతం తీసుకువచ్చారు. కానీ, ప్రస్తుతం హైదరాబాద్ నుంచి మాత్రమే ఎక్కువ శాతం నాటికలు ప్రదర్శించే వారు వస్తున్నారు. దీంతో భారతీయ నాటిక పోటీలు ఇంకా రాష్ట్రస్థాయిలో ఉండిపోయాయి. ఇక జాతీయస్థాయిలో పోటీలు కలగానే మిగిలిపోయే అవకాశాలు ఉన్నాయా అంటూ ప్రేక్షకులు చర్చించుకుంటున్నారు. దీనికి గతంలో విమర్శలు రావడంతో ఇప్పటి ఆహ్వాన పత్రికలో ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి పోటీలని ముద్రించి చేతులు దులుపుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైతం కళా సమితి ముందుకు వెళ్తే ఆదరణ బాగుంటుందని సూచిస్తున్నారు.

కమిటీలో సమన్వయ లోపం

భారతీయ నాటిక కళా సమితి కమిటీ సభ్యుల మధ్య సమన్వయం లోపించింది. గత నెల రోజుల నుంచి కార్యక్రమాలపై సమావేశాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ దాతలకు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందించడంలో విఫలమయ్యారు. ఈ నెల 3వ తేది నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతుండగా, రాత్రి వరకు ఆహ్వాన పత్రికలు పంచుతునే ఉండడం పట్ల విమర్శలకు గురవుతున్నారు. ఆహ్వాన పత్రికలో పలువురి పేర్లను సైతం తప్పుగా ముద్రించడం పట్ల దాతలు అసహనానికి గురయ్యారు. ఇక ఈ సారి భారీగానే విరాళాలు వసూలు చేసినట్లు తెలుస్తోంది?. మూలధన ఏర్పాటులో భాగంగా దాదాపు రూ.25 లక్షల వరకు కొత్తగా విరాళాలు సేకరించగా, ఆహ్వాన పత్రిక అడ్వటైజ్‌మెంట్ల ద్వారా రూ.3లక్షల వరకు సేకరించారు. గతేడాది కమిటీ సభ్యుల మధ్య విరాళాల సేకరణ, ఖర్చుల పద్దుల్లో కొంత పంచాయతీ ఏర్పడగా అంతర్గతంగా పరిష్కరించుకున్నారు. గతేడాది కార్యక్రమాల్లో స్టేజీ మీదకు పిలిచే సందర్భంలోనూ అతిథులు కమిటీ సభ్యులకు చివాట్లు పెట్టారు. మళ్లీ ఇవన్నీ పునరావృతం కాకుండా సభ్యులు చూసుకుంటూ సమన్వయంగా పని చేయాలని ప్రేక్షకులు ఆశిస్తున్నారు.



వర్ధన్నపేటలో భారతీయ నాటక కళాసమితి ఆడిటోరియంలో సాగుతున్న పనులు

పార్కింగ్‌కు అడ్డాగా కళా సమితి ప్రాంగణం

గతంలో శివరాత్రి సందర్భంగా నాటికల కోసం ఆడిటోరియాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రభుత్వ నిధులతో సైతం భారీగా షెడ్డు వేసి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఫంక్షన్లు చేసుకునేందుకు మినీ ఫంక్షన్ హాల్‌గా వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమాలు ముగియగానే ఎక్కడి వారు అక్కడికి వెళ్లిపోవడంతో కళా ప్రాంగణం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతోంది. దీనికి తోడు పక్కనే సినియా థియేటర్ ఉండడంతో ఎంచక్కా ఆ యాజమాన్యం సినిమాలకు వచ్చే ప్రేక్షకుల వాహనాలు ప్రాంగణంలో ఉంచి పార్కింగ్ ఫీజులను వసూలు చేసుకుంటున్నారు. ఇవన్నీ స్థానికంగా ఉన్న కమిటీ సభ్యులకు తెలిసినప్పటికీ వాటిపై దృష్టి సారించడంలేదు. నాటిక పోటీలు జరిగినప్పుడు ఊకదంపుడు ఉపన్యాస్యాలు ఇస్తున్న కమిటీ సభ్యులు కళలను ఆదరిస్తున్న ప్రజలకు పరోక్షంగా కళా ప్రాంగణం సహాయ పడే విధంగా చేయాలని కోరుతున్నారు.

నాటి కళలను కాపాడుకుంటాం : పెద్దూరి సంజీవరావు, కల్చరర్ సెక్రటరీ

నాటి కళలను కాపాడుకోవాలనే లక్ష్యంతో భారతీయ నాటకాలను క్రమం తప్పకుండా చేస్తున్నాం. దివంగత ఈగ శ్రీహరి ఆశయాలను కొనసాగించడంతో పాటు కళాసమితిని స్థాపించిన ప్రతీ ఒక్కరి నిబద్ధతను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్తున్నాం. కమిటీ సహాయ సహకారాలు, ప్రజల పూర్తి సహకారం, ప్రజా ప్రతినిధుల ప్రోత్సాహంతో మరింత విజయవంతంగా నాటిక ప్రదర్శనలు పూర్తి చేస్తాం.

అందరూ ఇన్‌చార్జ్‌లే..

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. ఆయన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలో పని చేస్తున్న రవీందర్. మిగతా మండలాల్లో సుదీర్ఘంగా సీనియర్ హెడ్‌మాస్టర్లే ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. సీనియర్ హెడ్‌మాస్టర్లకే ఈ బాధ్యతలు అప్పగించారు. వారు తమ రెగ్యులర్ హెచ్‌ఎం బాధ్యతలు చూసుకుంటూనే ఇటు ఎంఈవో విధులను కూడా నిర్వహించడానికి సతమతమవుతున్నారు. ఈ క్రమంలో దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు. గతంలో ప్రతీ మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. అనేక మంది రిటైర్ కావడం, కొందరు మృతి చెందడం, ఎంఈవోలుగా పదోన్నతులు లేకపోవడం, కొత్త నియామకాలు చేపట్టకపోవడం తదితర కారణాల వల్ల అసలు ఎంఈవోలే లేకుండా పోయారు. మండల పరిధిలోని ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఎంఈవోలదే కీలక భూమిక. పూర్తికాలపు ఎంఈవోలే లేకపోవడంతో సర్కార్ బళ్ల తీరు రాజు లేని రాజ్యం అయింది.

హెడ్‌మాస్టర్లు

ఏ పాఠశాల అయినా సక్రమంగా నడవాలన్నా, విద్యార్థుల చదువులు సక్కగా సాగాలన్నా, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నా హెడ్‌మాస్టర్లే కీలకం. ఉపాధ్యాయులను నియంత్రణలో పెట్టి విద్యాబోధన సరిగా జరిగేట్టు చూసే బాధ్యత హెచ్‌ఎంలది. అటువంటి వారే ఇన్‌చార్జిలుగా ఉంటే ఇక బడులు నడిచేదెలా? సదువులు సాగెదెలా? అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రిన్సిపాళ్లూ ఇన్‌చార్జిలే..

ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే బీఈడీ, డైట్ కళాశాలలకు సైతం పూర్తి కాలపు ప్రిన్సిపాళ్లు లేరు. హనుమకొండలోని డైట్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నారాయణరెడ్డి ఉన్నారు. ఆయనకు యాదాద్రి జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. రెండు బాధ్యతలను ఆయన చూసుకోలేక సతమతమవుతున్నారు. ఇక్కడ కొద్ది రోజులు, అక్కడ కొద్ది రోజులు విధులు నిర్వహిస్తూ ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు. హనుమకొండలోని బీఈడీ కాలేజీకి రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేరు. ఇదే కాలేజీలో లెక్చరర్ అయిన అబ్దుల్‌హై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. అంతటితో సరిపోదన్నట్టు హనుమండ జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా కూడా అదనపు బాధ్యతలను అప్పగించారు.

కొరవడిన పర్యవేక్షణ

ఇన్‌చార్జి డీఈవోలు, ఎంఈవోల కారణంగా ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమయ పాలన పాటించకపోవడం, తర్వాత పాఠశాలలకు వచ్చాక సంతకాలు పెట్టడం, విధి నిర్వహణ సమయంలో వ్యక్తిగత పనులపై బయట తిరగడం, ఉపాధ్యాయుల మధ్య విభేదాలు వంటివి చోటుచేసుకుంటున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయించొద్దని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా కొందరు ఇన్‌చార్జి ఎంఈవోలు పనిభారం పేరుతో పలువురు ఉపాధ్యాయులను ఆఫీసు పనుల కోసం కార్యాలయాలకు రప్పించుకుంటున్నారని తెలుస్తోంది. ఇదే అలుసుగా మరికొందరు ఉపాధ్యాయులు ఆఫీసు పని పేరు చెప్పుకొని సొంత పనులు చేసుకుంటున్నారని సమాచారం. దీంతో విద్యార్థులకు బోధన సరిగా అందడం లేదు. డీఈవోలు, ఎంఈవోలు అంతా ఇన్‌చార్జిలు కావడంతో విధుల నిర్వహణలో జవాబుదారీతనం కొరవడుతోంది. ఒకటికన్నా మించి అదనపు బాధ్యతలను అప్పగించడంవల్ల వారు దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు. ఫలితంగా పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతోంది. విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి.

మూడోరోజు మేడారం హుండీల లెక్కింపు

ఆదాయం రూ 3.46 కోట్లు



హనుమకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని టీటీడీ కళ్యాణ మండపంలో మేడారం హుండీల లెక్కింపు కొనసాగుతోంది. శనివారం మూడోరోజు 112 హుండీలను లెక్కించగా రూ 3,46,61,000 ఆదాయం సమకూరినట్లు మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈవో రాజేంద్రం తెలిపారు. దీంతో మూడు రోజులుగా నిర్వహించిన హుండీ లెక్కింపుతో మొత్తం రూ.9,60,36,000 సమకూరింది. మొత్తం 317 హుండీలను లెక్కిం చడం పూర్తయింది. మొదటి రోజు రూ.3,15,40,000, రెండోరోజు రూ. 2,98,35,000 కోట్లు ఆదాయం సమకూరింది. ఇంకా 201 హుండీలను లెక్కిం చాల్సి ఉంది. వచ్చే రెండు రోజుల్లో వీటిని లెక్కించడం పూర్తి చేస్తారు. మేడారం జాతరలో మొత్తం 518 హుండీలను ఏర్పాటు చేశారు. వీటిలో ఇనుప హుండీలు 482, క్లాత్ హుండీలు 34, బియ్యం హుండీలు. లెక్కించిన హుండీ ఆదాయాన్ని వెంట వెంటనే బ్యాంకులో జమ చేస్తున్నారు. హుండీల్లో ఇండియన్ కరెన్సీతో పాటు విదేశీ కరెన్సీ పెద్ద మొత్తంలో బయటపడుతోంది. దీనితో పాటు వెండి, బంగారు కానుకలు కూడా కంటపడుతున్నాయి. నాణాలు, బియ్యం పెద్దమొత్తంలో పోగవుతున్నాయి. నాణాలను చివరి రోజున తూకం వేయడం ద్వారా లెక్కిస్తారు. బియ్యాన్ని బస్తాల్లో నింపి నిలువ చేస్తున్నారు. లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రం వల్ల హుండీల లెక్కింపు త్వరితగతిన సాగుతోంది.

ఘనంగా శ్రీపాదరావు జయంతి

కాటారం, మార్చి 2: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం శ్రీపాదరావు జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ప్రభుత్వ, జీపీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయంలో శ్రీపాదరావు విగ్రహానికి అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీడీవో బాబు, ఎంపీవో ఉపేంద్రయ్యతో కలిసి కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో శ్రీపాదరావు జయంతిని ఘనంగా నిర్వహించారు.. మండలవ్యాప్తంగా అన్ని జీపీల పరిధిలో నాయకులు శ్రీపాదరావు చిత్రపటాలకు పూలమాలలు నివాళులర్పించారు. చింత కాని క్రాస్ వద్ద శ్రీపాదరావు విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. బస్వాపూర్‌లో శ్రీపాదరావు విగ్రహానికి యూత్ కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ సమ్మయ్య, తహసీల్దార్ నాగరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు సమ్మిరెడ్డి, యూత్ అధ్యక్షుడు సందీప్, ఎంపీటీసీలు రవీందర్‌రావు, మహేశ్వరి, విజయారెడ్డి, అజీజ్, రూపాదేవి, మమత, నాయకులు సుగుణ, దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రఘురాం, అశోక్, నవీన్‌రావు, మంత్రి విజయరాజు, లచ్చిరెడ్డి, కొట్టె శ్రీహరి, తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి, రాజు,



కాటారంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భాస్కర్, విక్రమ్, మొగిళి, బాపు, వెంకటస్వామి, దాదామియా, అమీర్, విక్రమ్, దేవేందర్ తదిరులు పాల్గొన్నారు.

● కాకతీయఖని : దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి పట్టణంలోని జీఎం కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి జీఎం బండి వెంకటయ్య హాజరై నివాళులర్పించారు. సింగరేణి అధికారులు తుకారం, శ్యాంప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల: శ్రీపాదరావు జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జీపీ కార్యాలయాలు, పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో రామయ్య, ఎంపీటీసీలు కట్కూరి పద్మ, దబ్బెట అనీల్, కోఆప్షన్ సభ్యుడు రాజ్‌మహ్మద్, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

● కృష్ణకాలనీ (భూపాలపల్లి) : జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్ శివారులోని రవాణాశాఖ కార్యాలయంలో శ్రీపాదరావు జయంతి వేడుకలను నిర్వహించారు. రవాణాశాఖ అధికారి సమ్మాని నేతృత్వంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● మహాముత్తారం : దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పక్కల సడువలి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గయ్య, లచ్చయ్య, రాజమల్లు, నజీర్ పాల్గొన్నారు.

● మల్హర్ : మండల కేంద్రంలోని కొయ్యూరు సెంటర్‌లో శ్రీపాదరావు జయంతి వేడుకలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, జడ్పీటీసీ ఐత కోమల రాజిరెడ్డి, ఎస్సీ సెల్ చైర్మన్ దండు రమేష్, యూత్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి, వివిద గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● మహదేవపూర్: దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, ఎంపీపీ రాణిబాయి, జడ్పీటీసీ అరుణ పాల్గొన్నారు. కాళేశ్వరంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రదాన కార్యదర్శి అశోక్, ఎంపీటీసీ మమత, శ్రీనివాసరెడ్డి, పవన్‌కుమార్. లక్ష్మణ్ పాల్గొన్నారు.

దుప్పి మాంసం పట్టివేత

మహదేవపూర్ రూరల్, మార్చి 2 : దుప్పి మాంసాన్ని ఫారెస్టు అధికారులు మండలంలోని సూరారంలో శనివారం స్వాధీనం చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన మందోట సురేష్ అనే వ్యక్తి దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో అక్కడికి చేరుకున్నామని తెలిపారు. 1250 గ్రాముల దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

చిన్నకాళేశ్వరం పంప్‌హౌస్‌ను పరిశీలించిన అధికారులు

మహదేవపూర్, మార్చి 2: మండలంలోని చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులోని స్టేజ్ -1 పంప్‌హౌస్‌ను ఇరిగేషన్ అధికారులు శనివారం సందర్శించారు. ఈఎన్‌సీ అనిల్‌కుమార్, నీటిపారుదల శాఖ అడ్వయిజర్ పెంటారెడ్డి, ఎస్‌ఈ కరుణాకర్, మెగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ వెంకటరామారావు పంప్‌హౌస్‌ను సందర్శించారు. 2008లో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు అప్పటి ప్రభుత్వం శంకుస్థాపన చేయగా పనులు ఇప్పటి వరకు పూర్తి కాలేదు. తాజాగా రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో చిన్న కాళేశ్వరంపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించిన నేపథ్యంలో అధికారుల బృందం పర్యటించడంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

శివరాత్రి జాతర పోస్టర్ ఆవిష్కరణ

మహదేవపూర్, మార్చి 2: మండలంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆల యంలో ఈ నెల 7 నుండి 9 వరకు నిర్వహించే మహాశివ రాత్రి జాతర పోస్టర్, కరత్రాలను మంత్రి శ్రీధర్‌బాబు శనివారం ఆవిష్కరించారు. మంథనిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈవో మారుతి, ముఖ్య అర్చకుడు ఫణీంద్రశర్మ, వైకుంఠ పాండా, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమలంలో వీడని ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

హంస్సేన్‌నాయక్, యాప సీతయ్యల్లో ఒకరికి టికెట్ ఖాయంగా బీజేపీ శ్రేణులు భావించాయి. రాష్ట్రంలో ఆదిలాబాద్, మహబూబాబాద్ ఎంపీ సీట్లే ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. ఆదిలాబాద్ నుంచి ఆదివాసీలకు టికెట్ ఇస్తే, మహబూబాబాద్‌లో లంబాడా సామాజిక వర్గం నుంచి టికెట్ ఇస్తారనే చర్చ జరిగింది. అయితే ఆదిలాబాద్ బీజేపీ సిట్టింగ్ స్థానమైనప్పటికి తొలిజాబితాలో అభ్యర్థిని ప్రకటించలేదు. దీంతో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి తెలితేనే మహబూబా బాద్ సీటుపై ఎవరికి అనేది స్పష్టత వస్తుందని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి.

ప్యారాచూట్ నేతల కోసమేనా..?

తొలి జాబితాలో వరంగల్, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులను బీజేపీ ప్రకటించకపోవడానికి మరో కారణం కూడా ఉందన్న చర్చ జరుగుతోంది. ఇటీవల బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్‌కు చెందిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కు, నాగర్‌కర్నూలు ఎంపీ రాములు కుమారుడు భరత్‌కు సీట్లు ఖరారయయ్యాయి. దీంతో వరంగల్ నుంచి పోటీ చేయాలని బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేపై బీజేపీ నేతలు ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. బీఆర్‌ఎస్‌ను వీడిన తరువాత బీజేపీలో టికెట్ ఇవ్వకపోతే ఏలా అనే ప్రశ్నలు ఆ మాజీ ఎమ్మెల్యే నుంచి బీజేపీ నేతలకు ఎదరయ్యాయి. దీంతో పార్టీలో చేరిన వారికి అధిష్టానం టికెట్ ఇచ్చిందని.. జహీరాబాద్, నాగూర్‌కర్నూలు ఉదాంతాన్ని చూపెడుతూ.. ఓ బీఆర్‌ఎస్ నేతను బీజేపీలో చేర్చుకుని టికెట్ ఇస్తారనే ప్రచారం కూడా జరుగుతోంది. అలాగే మానుకోట నుంచి కూడా ఓ మాజీ ఎంపీతో పాటు కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే కూడా గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం ఉంది. వీరితో చర్చలు చివరి దశలో ఉండటంతో తొలి జాబితాలో అభ్యర్థిని ఖరారు చేయలేదని సమాచారం. మొత్తానికి ప్యారాచూట్ నేతల కోసం అధిష్టానం ఎదురుచూస్తుందనే ప్రచారంతో టికెట్ కోసం ఎన్నో ఆశలతో ఉన్న నేతల్లో ఉత్కంఠ నెలకొంది.

ఆదివాసీ న్యాయ కళాశాల కోసం ఉద్యమించాలి

వెంకటాపురం(నూగూరు), మార్చి 2: భద్రాచలం కేంద్రంగా ఆదివాసీ న్యాయ కళాశాల కోసం ఆదివాసీలు ఉద్యమించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి పిలుపునిచ్చారు. శనివారం మండలకేంద్రంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రాచలం కేంద్రంగా ఆదివాసీ న్యాయ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా ఈప్రాంతం నుంచి దూర ప్రాంతాలకు వెళ్లి న్యాయ విద్యను అభ్యసించలేని వారికి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. న్యాయ కళాశాల ఏర్పాటు వల్ల ఆదివాసీ విద్యార్థులు ఉపాధి పొందుతారని అన్నారు. భద్రాచలంలో న్యాయ కళాశాల ఏర్పాటు కోరుతూ ఈనెల 4వతేదీన నిర్వహించే చలో భద్రాచలం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసమావేశంలో నాయకులు తాటి రమేష్, లోకేష్, కాంతయ్య, ఐతు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీ పథకాలపై కళాప్రదర్శనలు

వాజేడు, మార్చి 2: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాలపై మండలంలో శనివా రం కళాప్రదర్శనలు జరిగాయి. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు సాంస్కృతిక సారథి మార్త రవి కళా బృందం మం డల కేంద్రంతో పాటు జగన్నా థపురం, గుమ్మడిదొడ్డి గ్రామాల్లో అవగాహన ప్రదర్శనలను నిర్వ హించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని తెలుపుతూ ఆటపాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రాగుల శంకర్, ఎం.డి.రహీముద్దీన్, ఈర్ల సాగర్, కనకం రాజేందర్, గోల్కొండ బుచ్చన్న, బోడ కిషన్, రేలా విజయ్, రామంచ సురేష్, అమ్మపాట తిరుపతి, రేలా కుమార్, ఉంద్రతి భాస్కర్, నరేష్, దీపక్, రాము, శ్రీలత, శోభ పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

వెంకటాపురం(నూగూరు), మార్చి 2: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివా రం సీఆర్పీఎఫ్-ఈ/39 బెటాలి యన్ ఆధ్వర్యంలో సివిక్‌యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కమాండెంట్ రమా కాంత్ విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులకు వాలీబాల్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఆఫీసర్ ఇన్ కమాండెంట్ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న కమాండెంట్ రమాకాంత్

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కాటారం, మార్చి 2: మండ లంలోని ములకల్లవాడలో మిష న్‌భగీరథ పైప్‌లైన్ లేక నీటి కోసం గోసపడుతున్నామంటూ మహిళలు శనివారం ఖాళీ బింది లతో రోడ్డుపై బైఠాయించి నిర సన తెలిపారు. గతంలో గ్రామ మంతా పైప్‌లైన్ వేసి తమ వాడకే నేటి వరకు పైప్‌లైన్ వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి ఎన్నోమార్లు తీసుకెళ్లినా పని జరగలేదని అన్నారు. అధికారులు తమ బాధలు గుర్తించి పైప్‌లైన్ వేసి తాగునీటి ఇబ్బందిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ములకల్ల సరోజన, పుష్పలత, శ్రీదేవి, వీరమ్మ, లక్ష్మి, బాపురెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి నస్తూరుపల్లిలో మల్లన్న బోనాల జాతర

కాటారం, మార్చి 2: మండలంలోని నస్తూరుపల్లి గ్రామంలో శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం, బోనాల జాతర ఆదివారం ప్రారంభం కానుంది. ఈ మేరకు నిర్వాహణ కమిటీ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆది, సోమవారాల్లో రెండురోజులపాటు ఈ జాతర జరగనుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రక్తదాన శిబిరం

మంగపేట, మార్చి 2: మండలంలోని జ్వాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది యువకులు రక్తదానం చేశారు. మంగపేట పీహెచ్‌సీ, అనాథ వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంగపేట శ్రీ ఉమాచంద్ర శేఖరస్వామి దేవస్థానం చైర్మన్, జ్వాల చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు కొలగట్ల నరేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కస్పా ముకుందం, కార్యదర్శి ఎ.సతీష్, మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్నిత తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

కాటారం, మార్చి 2: మండలంలోని మేడిపల్లి గ్రామంలో గుండ సంతోష్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. రూ.3వేలకు పైగా విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు కాటారం ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అలాగే మండల కేంద్రంలోని వైన్‌షాపుల్లో సీఐ నరేందర్ తనిఖీ నిర్వహించారు. రి మద్యం స్టాక్‌ను పరిశీలించారు. ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల బదిలీ

కాకతీయఖని, మార్చి 2: భూపాలపల్లి ఏరియాలోని వివిధ గనుల్లో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్ కార్మికులు 38 మంది కొత్తగూడెంలోని పీవీకే-5 గనికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ఫిబ్రవరి 28న ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా జనవరి 10న అర్జీ పెట్టుకోగా బదిలీ చేసింది. ఏరియాలోని కేటీకే-1వ గని నుంచి ఐదుగురు, కేటీకే-5వ గని నుంచి ముగ్గురు, కేటీకే-6వ గని నుంచి ఇద్దరు, కేటీకే-8వ గని నుంచి 28 మంది కార్మికులు బదిలీ అయ్యారు. వీరంతా ఈనెల 5న కొత్తగూడెంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలి : తస్లీమా

ములుగు కలెక్టరేట్, మార్చి 2: కబడ్డీ క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో రాణించాలని మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. ఈనెల 2నుంచి 4 వరకు నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్‌లో జరిగే 70వ రాష్ట్రస్థాయి సీనియర్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే ములుగు జిల్లా క్రీడాకారులకు శనివారం హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఆమె టీషర్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీవైఎస్‌వో తుల రవి, మంగపేట ఎంపీడీవో సుదర్శన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ జనార్ధన్, బాక్సింగ్ కోచ్ మామిడిపెల్లి రమేష్ పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీలు సహజం

మొగుళ్లపల్లి, మార్చి 2: ఉద్యోగులకు బదిలీలు సహజమని, వారు ప్రజలకు అందించిన సేవలు శాశ్వతంగా నిలిచిపోతాయని ఎంపీపీ యార సుజాత అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కృష్ణవేణి ఆత్మీయ వీడ్కోలు సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ మండలంలో రెండేళ్లపాటు కృష్ణవేణి సేవలందించారని, ఆమె మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని ఎంపీటీసీలు, అధికారులు, మాజీ సర్పంచ్‌లు ఆమెను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, జడ్పీటీసీ జోరిక సదయ్య, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలపై అప్రమత్తంగా ఉండాలి : డీఈవో

ములుగు కలెక్టరేట్, మార్చి 2: ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని సూచించారు. శనివారం ములుగులో జిల్లాలోని 21 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారులతో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డ్యూయెల్ డెస్కులు, ఇతర ఫర్నీచర్ అందుబాటులో ఉన్నాయా లేదా సరిచూసుకోవాలని, ప్రతి పరీక్ష కేంద్రాలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లను సరిచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, శ్రీనివాసులు, దివాకర్, సాంబయ్య, సురేందర్, వెంకటేశ్వర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

‘పల్స్ పోలియో’ను విజయవంతం చేయాలి

ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగు కలెక్టరేట్, మార్చి 2: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. ములుగులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సమావేశపు హాల్‌లో వైద్యాధికారులు, సిబ్బందికి శనివారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఐదేళ్లలోపు పిల్లలందరికీ ఆదివారం పోలియో చుక్కలు వేయాలన్నారు. హైరిస్క్ ప్రాంతాలపై దృష్టి కేటాయించి వారిని గుర్తించి చుక్కల మందు వేయాలన్నారు. ఇటుక బట్టీలు, మిర్చికల్లాలు, ఫిషర్‌మన్లు ఉండే ప్రాంతాలను చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు. అదేవిధంగా 4,5 తేదీల్లో సిబ్బంది గ్రామాల్లోని ఇంటింటికీ తిరుగుతూ చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని అన్నారు.

మహిళా చైతన్యంతోనే హింస రహిత సమాజం

ములుగు కలెక్టరేట్, మార్చి 2: మహిళా చైతన్యంతోనే హింసరహిత సమాజాన్ని నిర్మించొచ్చని జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం ములుగు మండలంలోని జాకారం గ్రామంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్నిరంగాల్లో ముందంజలో ఉన్నారని, ఆర్థిక స్వేచ్ఛతో కూడిన అభివృద్ధి తప్పకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖమరున్నీసా, మహిళలు పాల్గొన్నారు.

అధికారుల తీరుతో కార్మికులకు అన్యాయం

ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రమేష్

కాకతీయఖని, మార్చి 2: సర్క్యులర్లు, అగ్రిమెంట్లను తిరస్కరిస్తూ ఏరియా సింగరేణి అధికారులు కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఏఐటీయూసీ భూపాలపల్లి బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కార్మికుల హక్కుల విషయంలో కార్మిక సంఘాలతో చేసుకున్న అగ్రిమెంట్లను భూపాలపల్లి ఏరియా సింగరేణి అధికారులు తుంగలో తొకుతున్నారని ఆరోపించారు. జేబీసీసీఐ అగ్రిమెంట్‌కు అనుగుణంగా ఓ కార్మికుడి పదో తరగతి సర్టిఫికెట్ ఆధారంగా పుట్టిన తేదీని సవరించాలని 2012 నుంచి యాజమాన్యంతో పోరాడుతున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. అలాంటి సమస్యలున్న సింగరేణి కార్మికులు లక్షలు వెచ్చించి కోర్టులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. ఓసీ-2లో పనిచేస్తున్న ఓ కార్మికుడి విషయాన్ని కార్పొరేట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఏజ్ అసెస్‌మెంట్ కమిటీ ద్వారా రిపోర్టు పంపాలని జీఎం (పర్సనల్, ఐఅండ్‌పీఆర్) 2023లో ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. అయినా అతడి సమస్యన్యను పరిష్కరించలేదని పేర్కొన్నారు. డిపెండెంట్ ఎంపాయిమెంట్ ప్రారంభం అయినప్పటి నుంచి భూపాలపల్లి ఏరియాలో విపరీతమైన అవినీతి పెరిగిందని ఆరోపించారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ములుగు కలెక్టరేట్, మార్చి 2: రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించిన నేపథ్యంలో కృతజ్ఞ తలు తెలియజేస్తూ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం జిల్లా కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాపాలన సాగిస్తుందని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, నాయకులు అయూబ్‌ఖాన్, జక్కుల రేవంత్, కంబాల రవి, నూనేటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సెక్స్ వర్కర్లకు ఉపాధి కల్పించాలి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 2: సెక్స్ వర్కర్లకు తగిన ఉపాధి కల్పించాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ మెరుగు రవీందర్ అన్నారు. అంతర్జాతీయ సెక్స్ వర్కర్ల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్స్ వృత్తిని ఎవరూ చేయడానికి ఇష్టపడరని, కుటుంబ ఆర్థిక పరిస్థితులు కారణంగా ఇందులోకి దిగుతారని అన్నారు. ఆర్థిక పరిస్థితులు మెరుగు పర్చేలా చర్యలు చేపట్టినప్పుడే వారు ఈ వృత్తిని విడనాడుతారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కిరణ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ కంప అక్షయ, అసిస్టెంట్ ప్రియాంక, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ ఉమాదేవి, జ్యోతి, సదానందం పాల్గొన్నారు.

బోనకల్‌కు ములుగు జిల్లా అధికారులు

బోనకల్, మార్చి2: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క డ్రీమ్ ప్రాజెక్టు ఇందిరా డెయిరీపై ములుగు జిల్లా అధికారులు సమీక్ష జరిపారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ములుగు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ కుమార్, అడిషనల్ డీఆర్‌డీవో బాలస్వామి, డీపీఎంలు వేణుగోపాల్, సతీష్ శనివారం బోనకల్ ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించారు. తమ జిల్లాలో మినీ ఇందిరా డెయిరీ నిర్వహించుకునే కార్యక్రమంలో భాగంగా ఇక్కడ జరుగుతున్న పనులు, పథక లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్‌డీవో నూరుద్దీన్, డీపీఎం లక్ష్మణ్‌రావు పథకం గురించి వివరించారు. మధిర నియోజకవర్గం బోనకల్‌లో ప్రారంభించనున్న ఇందిరా డెయిరీలో 20వేల మంది మహిళలను వాటాదారులుగా చేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఒక్కొక్కరు రూ. 2వేలు డిపాజిట్ చేసి వాటాదారులుగా చేర్చితే ప్రభుత్వం నుంచి వచ్చే వాటా ధనంతో డెయిరీ కొనసాగుతుందన్నారు. పాడి పరిశ్రమతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి, దాణా మిక్సింగ్ యంత్రాలు, గడ్డి కటింగ్, ప్రత్యేక రుణాలు ఇచ్చే అంశాల గురించి సమగ్రంగా వివరించారు. బోనకల్‌లో 9.24 ఎకరాల భూమి కేటాయింపుతో పాటు చేపట్టాల్సిన పనుల గురించి అవగాహన కల్పించారు.

టోల్‌ప్లాజా పైనుంచి పడి ఉద్యోగి మృతి

కుటుంబ సభ్యుల ఆందోళన



టోల్‌ప్లాజా వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు



కల్యాణ్ (ఫైల్)

వెంకటాపూర్(రామప్ప), మార్చి 2: టోల్‌ప్లాజా బిల్డింగ్ పైనుంచి పడి ఓ ఉద్యోగి మృతి చెందిన సం ఘటన ములుగు జిల్లా వెంకటా పూర్ (రామప్ప) మండలం జవహర్‌నగర్ వద్ద శనివా రం తెల్లవారుజామున జరిగింది. ఓ విషయమై మేనేజర్ కోప్పడిన అనంతరం భయంతో కిందికి దిగుతుండగా అతడు జారి పడటంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఎస్‌ఐ చల్ల రాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలం ఇంచర్ల గ్రామానికి చెందిన సంగ కల్యాణ్(30) వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలోని టోల్‌ప్లాజాలో మూడేళ్లుగా టికెట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. రోజూలాగే శుక్రవారం కూడా డ్యూటీకి వచ్చాడు. శనివారం తెల్లవారుజామున 2.30గంటల సమయంలో మరో ఉద్యోగితో కలిసి కల్యాణ్ ప్లాజా పైనుంచి కిందికి దిగుతున్న క్రమంలో కాలుజారి కింద పడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలవగా తోటి ఉద్యోగులు ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో కల్యాణ్ మృతిచెందాడు.

బైఠాయించిన కుటుంబ సభ్యులు

టోల్‌ప్లాజా మేనేజర్ కోపగించుకున్నాడని, ఆ భయంతో కిందికి దిగుతున్న క్రమంలోనే కల్యాణ్ కిందపడి మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు సంఘటన స్థలం వద్ద ఆందోళనకు దిగారు. మేడారం జాతరకు నెలరోజుల ముందు నుంచే టోల్‌ప్లాజా సిబ్బంది తీవ్ర పని ఒత్తిడితో సతమతమవుతున్నారని, ఈ క్రమంలోనే శనివారం తెల్లవారుజామున మేనేజర్ విధుల్లో ఉన్న సిబ్బందిపై కోపంగా అరవడంతో భయంతో కిందికి దిగుతున్న క్రమంలో కల్యాణ్ కాలుజారి కిందపడి మృతిచెందాడన్నారు. తమకు న్యాయం చేసే వరకు కదిలేది లేదని భీష్మించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ రాజు వారితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో కల్యాణ్ కుటుంబ సభ్యులు ఆందోళనను విరమించారు. మృతుడి తండ్రి ఓదెలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. కల్యాణ్‌కు తల్లిదండ్రులు, భార్య ఉన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణలో పకడ్బందీగా వ్యవహరించాలి

భూపాలపల్లి అదనపు ఎస్పీ నరేష్‌కుమార్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 2: ఇంటర్మీడియట్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పకడ్బందీగా వ్యవహరించాలని అదనపు ఎస్పీ నరేష్ కుమార్ అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఆయా కేంద్రాల వద్ద చేపడుతున్న పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలపై పోలీసులతో పాటు ఇన్విజిలేటర్లు దృష్టి పెట్టాలని సూచించారు. 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల పరిసరాల్లోకి ఎవరినీ అనుమతించొద్దని సూచించారు. ఆయన వెంట భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ ఉన్నారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్

భూపాలపల్లిటౌన్, మార్చి 2: ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పీఆర్‌సీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.రఘుపతి అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగుల స్నేహపూర్వక ప్రభుత్వం అని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్‌సీని ప్రకటించాలని కోరారు. బదిలీలు, ప్రమోషన్లను కూడా చేపట్టాలని, విద్యా శాఖ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని అన్నారు. జీవో 317పై వెంటనే మంత్రివర్గ సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్, నాయకులు రాంనాయక్, శ్రీధర్, రాజేందర్, సూర్యకిరణ్, రాణి, కన్నయ్య, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోమశేఖర్

జిల్లా కార్యవర్గం ఎన్నిక

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.తిరుపతి, కార్యదర్శిగా కె.కుమారస్వామి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రామయ్య ఎన్నికయ్యారు.

కేటీఆర్ మెంటల్ ఆస్పత్రికి వెళ్లాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్

ములుగు కలెక్టరేట్, మార్చి 2: ఎమ్మెల్యే కేటీఆర్ మేడిగడ్డకు కాదు.. ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రికి వెళ్లాలని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్ వ్యాఖ్యానించారు. ఈమేరకు శనివారం ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు. మేడిగడ్డ విషయంలో బీఆర్‌ఎస్ నేతల జిమ్మిక్కులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. మేడిగడ్డ కుంగుబాటుపై కేటీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ నేతలు వితండవాదం చేయడం సరికాదని హితవు పలికారు. మాజీ సీఎం కేసీఆర్ మెడకు మేడిగడ్డ ఉచ్చు కచ్చితంగా బిగుస్తుందని తెలిపారు. జియాలాజికల్ సర్వే ప్రకారం మేడిగడ్డ వద్ద డ్యామ్ కట్టొద్దని సేఫ్టీ అధికారులు ఇంతకుముందే చెప్పారని, వారి మాట వినకుండా నిర్మించడం అవినీతికి అద్దంపడుతుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతికి కేసీఆర్, కేటీఆర్‌ను బాధ్యులుగా చేస్తూ చట్టం శిక్ష వేస్తుందని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తిన్న వేల కోట్లరూపాయలను ముందుగానే ప్రభుత్వానికి ఇచ్చి చేసిన తప్పును నేతలు ఒప్పుకోవాలని, అంతేకాకుండా తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న ‘దేవాదుల’ పంపింగ్

కన్నాయిగూడెం , మార్చి 2 : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెకు నుంచి పంపింగ్ కొనసాగుతోంది. ఇప్పటికే ఫేజ్-2లో ఒక మోటారు, ఫేజ్-3లో రెండు మోటార్ల ద్వారా ఇంజనీరింగ్ అధికారులు పంపింగ్ కొనసాగిస్తున్నారు. ఫేజ్-3లో బుధవారం ఒక మోటారు, శనివారం మరో మోటారు ఆన్ చేశారు. మొత్తం 5 మోటార్ల ద్వారా 1,414 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నట్లు ఇరిగేషన్ డీఈఈ శరత్ తెలిపారు.

సమ్మక్కసాగర్ నుంచి దిగువకు నీటి విడుదల

మండలంలోనితుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి 2,760 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజీలోని రెండు గేట్ల ద్వారా దిగువకు 6 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గురు, శుక్ర, శని వారాల్లో మూడు రోజుల్లోనే 1.11 టీఎమ్సీల నీటిని దిగువకు వదిలారు. ఎగువన ఉన్న మహారాష్ట్ర సోమ్నూర్ వద్ద శివరాత్రిని పురష్కరించుకొని జాతర జరుగుతున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు పడకుండా గోదావరి, ఇంద్రావతి నదుల్లో నీటి నిల్వలు లేకుండా దిగువకు వదలాలని మహారాష్ట్ర అధికారుల సూచించారు. దీంతో దిగువకు నీటిని భారీగా వదులుతున్నట్లు తుపాకులగూడెం ఏఈ సాయిరాం తెలిపారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటిమట్టం 6.94 టీఎమ్సీలు కాగా ప్రస్తుతం 3.07 టీఎమ్సీలు నిల్వ ఉన్నాయి. బ్యారేజీ వద్ద 78.40, దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 77.8 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.